సాక్షి
పార్వతీపురం మన్యం

శుక్రవారం । 22 । డిసెంబర్ । 2023



శ్రమించారు.. సాధించారు

ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన యువతీ యువకులు శ్రమించారు. పరీక్షలో విజేతలుగా నిలిచి ఎస్‌ఐ కొలువులు సాధించారు. యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచారు. - 8లో



కరోనా పట్ల అప్రమత్తం

దేశంలో మళ్లీ కరోనా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో వైద్యారోగ్యశాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పీడిక రాజన్నదొర వైద్యులకు సూచించారు. - 8లో

నేటి నుంచి ఆడుదాం-ఆంధ్రా 2కే రన్

విజయనగరం అర్బన్: ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీల్లో ప్రజలను భాగస్వాములను చేసేందుకు శుక్రవారం నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని జేసీ కె.మయూర్ అశోక్ ఎంపీడీఓలు, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్‌లను ఆదేశించారు. కార్యక్రమ నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్‌లో గురువారం దిశానిర్దేశం చేశారు. 2కే రన్, యోగా ప్రదర్శనలు ఈ నెల 25వరకు నిర్వహించాలన్నారు.

న్యూస్‌రీల్

తప్పులులేని ఓటరు జాబితాలు సిద్ధం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల రోల్ అబ్జర్వర్ శ్యామలరావు

పార్వతీపురం: ఓటరు ముసాయిదా జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణకు సంబంధించిన నివేదికలను సిద్ధం చేయాలని జిల్లా ఎన్నికల పరిశీలకుడు జె.శ్యామలరావు ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఓటరు నమోదు అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఫారం-6, 7, 8 ఆధారంగా ఓటర్ల జాబితా రూపకల్పనలో అవలంభిస్తున్న విధానాలపై అసెంబ్లీ నియోజకవర్గాలు, పోలింగ్ కేంద్రాల వారీగా సమీక్షించారు. డిసెంబర్ 26వ తేదీ వరకు అందిన అభ్యంతరాలను పరిష్కరించి తప్పులులేని తుది ఓటరు జాబితా ప్రకటించాలని సూచించారు. సమావేశంలో జేసీ గోవిందరావు, డీఆర్‌ఓ జె.వెంకటరావు, సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి, పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, ఆర్డీఓలు ఎం.లావణ్య, కె.ఆర్.ఆర్.సి.శివకేశవనాయుడు, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులో ఉద్యోగాలకు రాతపరీక్ష



రాతపరీక్షకు హాజరైన అభ్యర్థులు

సీతంపేట: ఐటీడీఏ ఆధ్వర్యంలో పాలకొండలో నిర్వహించే పెట్రోల్ బంకులో ఉద్యోగాల భర్తీకి గురువారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో రాతపరీక్ష నిర్వహించారు. ఒక సూపర్ వైజర్ ఉద్యోగానికి 52 మంది దరఖాస్తు చేసుకోగా 41 మంది హాజరయ్యారు. 7 పంప్ బాయ్ ఉద్యోగాలకు 128 మంది దరఖాస్తుచేసుకోగా 87 మంది పరీక్ష రాశారు. ఐటీడీఏ ఏపీఓ రోసిరెడ్డి, డీడీ మంగవేణి, ఏఎంఓ కోటిబాబు, జీసీడీఓ రాములమ్మ, తదితరులు పరీక్షకేంద్రాన్ని పర్యవేక్షించారు.

జేఎన్‌టీయూకు పరిశోధన ప్రాజెక్టు



ప్రొఫెసర్ జి.స్వామినాయుడు, పూర్వ రిజిస్ట్రార్, జేఎన్‌టీయూ జీవీ

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) పూర్వ రిజిస్ట్రార్, ప్రొఫెసర్ జి.స్వామినాయుడు ఆధ్వర్యంలో పరిశోధనకు ప్రతిష్టాత్మకమైన డిఫెన్స్ అప్లికేషన్స్‌కు సంబంధించిన ప్రాజెక్టు మంజూరైంది. ఈ మేరకు సైన్స్ అండ్ ఇంజినీరింగ్ రీసెర్చ్‌బోర్డు, స్టేట్ యూనివర్సిటీ రీసెర్చ్ ఎగ్జామినేషన్‌ల నుంచి పరిశోధన అనుమతులు వచ్చాయి. సివియర్ ప్లాస్టిక్ డీఫార్మేషన్ ద్వారా తయారు చేసే ఎంట్రోఫీఎల్లాయీస్‌కు సంబంధించిన మెకానికల్ ప్రాపర్టీ సామర్థ్యాన్ని పెంచే పరిశోధనలు మూడేళ్లలోపు చేపట్టాల్సి ఉందని స్వామినాయుడు తెలిపారు. పరిశోధన ప్రాజెక్టులు పూర్తిచేసేందుకు రూ.29 లక్షలు మంజూరవుతాయని చెప్పారు. కొత్తగా ఏర్పడిన వర్సిటీకి అరుదైన ప్రాజెక్టు సాధించడంపై స్వామినాయుడుని వర్సిటీ సిబ్బంది అభినందించారు.

23న సెంచూరియన్ వర్సిటీ స్నాతకోత్సవం

- వర్సిటీ వీసీ ప్రశాంతకుమార్ మహంతి
- ఒకరికి డాక్టరేట్, 140 మందికి డిగ్రీల ప్రదానం



సమావేశంలో మాట్లాడుతున్న సెంచూరియన్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.కె.మహంతి

నెల్లిమర్ల రూరల్: టెక్కలిలోని సెంచూరియన్ విశ్వవిద్యాలయం మూడో స్నాతకోత్సవ వేడుకలను ఈ నెల 23న నిర్వహించనున్నట్టు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంతకుమార్ మహంతి తెలిపారు. వర్సిటీలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్నాతకోత్సవంలో ఒకరికి డాక్టరేట్, 140 మందికి డిగ్రీలను ప్రదానం చేస్తామన్నారు. 12 మందికి బంగారు పతకాలు, ఏడుగురికి నగదు ప్రోత్సాహకాలు అందిస్తామని చెప్పారు. విశ్వ విద్యాలయంలో ఆచరణాత్మక పద్ధతుల్లో విద్యను బోధించడం వల్ల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ మార్కెట్‌లో నేడు డిమాండ్ ఉన్న కోర్సులను వర్సిటీలో అందుబాటులో ఉంచామని చెప్పారు. వేడుకలను చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్‌ఎన్ రాజు, చైర్మన్ ప్రొఫెసర్ ముక్తికాంత మిశ్రా ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో డీన్‌లు డాక్టర్ మాధవరావు, ఎంఎల్‌ఎన్ ఆచార్యులు, డాక్టర్ సన్నీడియోల్ పాల్గొన్నారు.

ఆయుష్మాన్‌భవ..!



పెదమేరంగి కూడలిలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేరిట పాలకొండ కోటదుర్గమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, తదితరులు



పార్వతీపురం పట్టణంలో కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

- ఊరూరా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు
- సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకాలు
- పలుచోట్ల రక్తదాన శిబిరాల నిర్వహణ
- రామతీర్థంలో ప్రత్యేక పూజలు, అన్నదానం
- ఆస్పత్రుల్లోని రోగులకు పండ్లు, పేదలకు దుస్తుల పంపిణీ



సాలూరు ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖమంత్రి పీడిక రాజన్నదొర

సాక్షి ప్రతినిధి, విజయనగరం: సంక్షేమ, అభివృద్ధి ప్రదాత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఉమ్మడి విజయనగరం జిల్లాలో గురువారం ఊరూరా ఉత్సాహంగా సాగాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేడుకల్లో పాల్గొన్నారు. కేక్‌లు కట్‌చేసి పంచిపెట్టారు. అభిమాన నేత నూరేళ్లపాటు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఆలయాల్లో పూజలు, చర్చిలు, మసీదుల్లో ప్రార్థనలు జరిపారు. రక్తదానం చేశారు. పేదలకు దుస్తులు, ఆస్పత్రుల్లోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

- పార్వతీపురం పట్టణంలో జగనన్న జన్మదిన వేడుకలు ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మొక్కలు నాటారు. మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కేక్‌కట్‌చేసి అభిమానులకు పంచిపెట్టారు. పేదలకు అన్నదానం చేశారు.
- పాలకొండ వైఎస్సార్ కూడలి వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలకొండ విక్రాంత్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కోట దుర్గమ్మ దేవస్థానంలో జగన్ పేరిట ప్రత్యేక అర్చనలు జరిపారు. ఎమ్మెల్సీ విక్రాంత్ ఇంటి వద్ద పాలవలస రాజశేఖర్ చేతుల మీదుగా కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు.
- సాలూరు నియోజకవర్గ కేంద్రంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ఆధ్వర్యంలో జగనన్న జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ కూడలి వద్ద వై.ఎస్.విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ముఖ్యమంత్రి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ మిఠాయిలు పంచిపెట్టారు. నవజీవన ఆశ్రమంలో నిరాశ్రయులకు అన్నదానం చేశారు. ఏరియా ఆస్పత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. రక్తదాన శిబిరం నిర్వహించారు.
- కురుపాం నియోజకవర్గంలోని జియ్యమ్మవలస మండలం పెదమేరంగి కూడలిలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మూడడ్ల గౌరీశంకరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు హాజరై కేక్ కట్‌చేశారు. 2000 మందికి అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు శశికళ, డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు, నాయకులు బాబూ భువనమోహనరావు, సర్పంచ్ కోట రమేష్, మరడాన కిశోర్ తదితరులు పాల్గొన్నారు.
- విజయనగరం జిల్లా పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకల్లో భాగంగా జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దివ్యాంగులకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు.
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నివాసంలో నిర్వహించిన వేడుకల్లో ఆయనతో పాటు ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్‌లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయా యాదవ్, ఎంపీపీ మామిడి అప్పలనాయుడు పాల్గొన్నారు. నిరుపేద దివ్యాంగులకు బ్యాటరీతో నడిచే త్రిచక్ర వాహనాలను పంపిణీ చేశారు.
- నెల్లిమర్ల నియోజకవర్గంలోని రామతీర్థంలో నిర్వహించిన ముఖ్యమంత్రి జన్మదిన వేడుల్లో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, నియోజకవర్గ పరిశీలకుడు అంధవరపు సూరిబాబు పాల్గొన్నారు. రాములోరి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

మేలు చేశారు.. ఆశీర్వదించండి



మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

- జగనన్న పాలనలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు
- గిరిజన ప్రాంతాలఅభివృద్ధికి ప్రాధాన్యం
- వచ్చేనెల నుంచి రూ.3వేల పింఛన్
- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి పాలన సాగిస్తూ.. ప్రజలకు మేలుచేస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లోనూ ఆశీర్వదించి మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర కోరారు. సాలూరు వైఎస్సార్ కూడలి వద్ద గురువారం నిర్వహించిన జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. విద్య, వైద్యం, వ్యవసాయం తదితర అన్ని రంగాలకు అగ్రపీఠం వేయడంతో పాటు జగనన్న అమ్మఒడి, చేయూత, విద్యాదీవెన, వసతిదీవెన, విదేశీవిద్య, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ రైతు భరోసా, పేదలందరికీ ఇళ్ల తదితర సంక్షేమ పథకాలతో పేదల జీవితాలకు వెలుగుదారి చూపిస్తున్నారన్నారు. పేదకుటుంబాల పిల్లల విదేశీ విద్యకు రూ.కోటి25లక్షల వరకు ఖర్చుచేస్తున్న ముఖ్యమంత్రి దేశంలో జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని పేర్కొన్నారు. ప్రజారోగ్యానికి పెద్దపీటవేస్తూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఆర్థిక పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.25లక్షల వరకు పెంచారన్నారు. వచ్చేనెల నుంచి అవ్వాతాతలకు రూ.3వేల పింఛన్ అందజేస్తారన్నారు. 2014లో జరిగిన ఎన్నికల్లో 600 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు... హామీలను అమలుచేయకుండా యువత, రైతులు, మహిళలు, ఇలా అన్నివర్గాల ప్రజలను మోసం చేశారన్నారు. చంద్రబాబునాయుడు లక్ష కోట్లు దోచుకున్నారని జనసేన నాయకుడు నాడు పవన్‌కళ్యాణ్ ఇదే సాలూరు సెంటర్‌లో ఆరోపించారని గుర్తుచేశారు. నేడు మరలా పవన్‌కళ్యాణ్, చంద్రబాబు పొత్తు పెట్టుకోవడం వారి నైతిక విలువలు లేని స్వార్థ రాజకీయాలకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. ఇలాంటి వారిని ప్రజలు నమ్మేపరిస్థితిలో లేరన్నారు. అంగన్‌వాడీ సంఘాల నాయకులతో ప్రభుత్వం చర్చలు జరుపుతోందని, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తుందని తెలిపారు. ప్రజలకు మేలుచేస్తున్న జగన్ పాలనకు, ప్రజలను మోసం చేసిన చంద్రబాబు పాలన మధ్య వ్యత్యాసాన్ని గుర్తించి, రానున్న ఎన్నికల్లో మరలా జగన్ మోహన్‌రెడ్డిను ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు.



సీఎంకు జన్మదిన శుభాకాంక్షలు



ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని కురుపాం, పాడేరు ఎమ్మెల్యేలు పుష్పశ్రీవాణి, భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, గిరిజన సహకార సంస్థ (జీసీసీ) చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గెద్దం ఉమ తదితరులు చింతపల్లిలో గురువారం కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అంతా శుభం కలగాలని ఆకాంక్షిస్తూ వినాయకుడి ప్రతిమను అందజేశారు. సీఎంతో సెల్ఫీదిగారు.

- సాక్షిప్రతినిధి, విజయనగరం

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై టీడీపీకి చిత్తశుద్ధి లేదు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: తెలుగుదేశం పార్టీ తన ఐదేళ్ల పాలనలో ఉత్తరాంధ్ర ప్రజలను దగా చేసిందే తప్ప, ఉత్తరాంధ్ర అభివృద్ధిపై చిత్తశుద్ధి చూపలేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగున్నరేళ్లుగా ప్రజారంజక పాలన చేస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రజల తరఫున జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ నేత నారాలోకేశ్ యువగళమంతా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై అక్కసుతోపాటు వ్యక్తిగత దూషణలు చేయడానికే పరిమితమైందన్నారు. నాలుగున్నరేళ్లుగా అవినీతిరహితంగా పాలన సాగిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై ఒక్క ఆరోపణ చేయలేకపోయారన్నారు. సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులపై మాట్లాడలేదంటే వైఎస్సార్ సీపీ జనరంజక పాలన టీడీపీకి అర్థమై ఉంటుందన్నారు. యువగళంలో టీడీపీ నేతలు ఉచిత పథకాలకు అలవాటుపడొద్దని ప్రజలకు కళ్లబొల్లి కథలు చెప్పి ఆరు ఉచిత పథకాలను ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. భోగాపురం విమానాశ్రయ నిరాశ్రయులకు పరిహారం మాటెత్తకుండా, టెండర్లు ఖరారు చేయకుండా ఎన్నికల ముందు చంద్రబాబు ఉత్తుత్తి శంకుస్థాపన చేసేశారన్నారు. అన్ని సమస్యలు పరిష్కరించాకే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనులు ప్రారంభించిందన్నారు. ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెట్టడం, ఎన్నికలయ్యాక ప్రజలకు శఠగోపం పెట్టడం చంద్రబాబుకు అలవాటేనన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు బీసీలకు తామేదో ప్రాధాన్యం కల్పిస్తున్నామని గొప్పలు చెప్పుకున్నారని, టీడీపీ పాలనలో బీసీ మహిళకు ఇచ్చిన మంత్రి పదవిని తీసేసి, క్షత్రియ వర్గానికి కేటాయించిన విషయం జిల్లా ప్రజలకు తెలుసన్నారు. ప్రజా సంక్షేమం, అన్ని ప్రాంతాల అభివృద్ధే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలనే తలంపుతో ముఖ్యమంత్రి ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తుంటే... టీడీపీ, ఎల్లో గ్యాంగ్ దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపు తథ్యమని, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమన్నారు. ఆయనవెంట పలాస నియోజవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు కేవీ సూర్యనారాయణ రాజు, వేపాడ జెడ్పీటీసీ సభ్యులు సేనాపతి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా కబడ్డీ పోటీల విజేత కృష్ణాజిల్లా

- ద్వితీయ స్థానం దక్కించుకున్న ఆతిథ్య విజయనగరం
- తృతీయ, నాల్గవ స్థానాల్లో నిలిచిన విశాఖ, గుంటూరు జట్లు
- విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన కురుపాం ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి



అతిథుల చేతుల మీదుగా మొదటి బహుమతి అందుకుంటున్న కృష్ణాజిల్లా జట్టు



అతిథుల చేతుల మీదుగా ద్వితీయ బహుమతి అందుకుంటున్న విజయనగరం కబడ్డీ జట్టు



తుదిపోరులో విజయనగరం, కృష్ణా జట్ల క్రీడాకారిణులు

విజయనగరం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని విజయనగరం జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి మహిళల ఆహ్వానపు కబడ్డీ పోటీల్లో కృష్ణా జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఆతిథ్య విజయనగరం జట్టు ద్వితీయ స్థానాన్ని చేజిక్కించుకోగా.. తృతీయ, నాల్గవ స్థానాలను వరుసగా విశాఖ, గుంటూరు జట్లు సొంతం చేసుకున్నాయి. విజయనగరం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ఆధ్వర్యంలో, కార్పొరేషన్ మహిళా విభాగం సారథ్యంలో నగరంలోని మహిళా పార్క్‌లో మూడురోజుల పాటు నిర్వహించిన పోటీలు గురువారంతో ముగిశాయి. పోటీల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 8 జట్లు తలపడ్డాయి.

తుది పోటీల్లో విజేతలుగా నిలిచిన నాలుగు జట్లకు వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ. 20 వేలు చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతులతో పాటు ట్రోఫీలను కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయాయాదవ్ తదితరులు అందజేశారు. రాష్ట్రంలో గతంలో ఎక్కడా, ఎన్నడూ నిర్వహించని విధంగా మహిళా పార్క్‌లో మహిళా క్రీడాకారులు.. మహిళా న్యాయ నిర్ణేతలు.. మహిళాప్రేక్షకుల నడుమ మహిళా అతిథులు చేతుల మీదగా నిర్వహించిన పోటీలు ఆద్యంతం ఉత్కంఠ భరితంగా, ఉత్సాహంగా సాగాయి. ముందుగా జగనన్న బర్త్‌డే కేక్‌ను కట్‌చేసి క్రీడాకారులకు పంచిపెట్టారు.

క్రీడలతో ఆరోగ్యం, ఆనందం

క్రీడల్లో పాల్గొనడం వల్ల ఆరోగ్యంతో పాటు మానసిక ఆనందం కలుగుతుందని కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. రాష్ట్రస్థాయి మహిళల ఆహ్వానపు కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మహిళా పార్కులో రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. మహిళల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో పోటీలు నిర్వహించిన కోలగట్ల శ్రావణి, ఇతర కార్పొరేటర్లకు అభినందనలు తెలిపారు. మహిళ ఒక స్త్రీ శక్తితో సమానమని, వారిలో మల్టీ టాలెంట్ ఉంటుందన్న విషయాన్ని అనేక సందర్భాల్లో బహిర్గతం చేస్తున్నారన్నారు. మహిళలు తమ ఆశయాలను, ఆలోచనలను క్రోడీకరించి ఎన్నో ఒత్తిళ్లకు లోనైనప్పటికీ అన్ని రంగాలలో విజయాన్ని సాధిస్తున్న సందర్భాలను గుర్తుచేశారు. విజయం చేకూరాలని ప్రోత్సహించి వివిధ ప్రాంతాలకు ఆడ పిల్లలను పంపిస్తున్న తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు మహిళా కార్పొరేటర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గిరి ప్రదక్షిణ భక్తులకు శుభప్రదం

● స్వామి శ్రీనివాసానంద సరస్వతి

విజయనగరం టౌన్: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 23న రామతీర్థంలో నిర్వహించే గిరి ప్రదక్షిణ కార్యక్రమంలో పాల్గొనడం భక్తులకు శుభప్రదమని ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు స్వామీజీ శ్రీనివాసానంద సరస్వతి పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక హిందూ ధర్మ రక్షణ సమితి కార్యాలయంలో గురువారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకల దేవతల చుట్టూ ప్రదక్షిణ చేసిన ఫలితం, పుణ్యం వస్తుందన్నారు. సింహాచలం, అన్నవరం, శ్రీకాళహస్తిలలో గిరిప్రదక్షిణకు ఎంతటి ప్రాముఖ్యం ఉందో, రామతీర్థం గిరిప్రదక్షణకు అంతటి ప్రాశస్త్యం ఉందన్నారు. ఈ నెల 23న ఉదయం 8 గంటలకు గిరిప్రదక్షిణ పూజా కార్యక్రమం అనంతరం ప్రదక్షిణ ప్రారంభమవుతుందన్నారు. వేలాది మందితో రామనామ సంకీర్తనలు, భజనలతో అంగరంగ వైభవంగా జరిగే గిరి ప్రదక్షిణలో పెద్ద ఎత్తున హిందూ బంధువులు పాల్గొనాలని కోరారు. ప్రభుత్వ యంత్రాంగం భక్తులకు మంచినీరు, అన్నప్రసాదం ఏర్పాట్లు చేయాలని సూచించారు. రామతీర్థం సేవా పరిషత్ వ్యవస్థాపకుడు జ్యోతిప్రసాద్ మాట్లాడుతూ రామతీర్థంలో ఉన్న రామగిరి ఎంతో ప్రాశస్త్యమైనదని, దానిచుట్టూ గిరి ప్రదక్షిణ చేయడం పుణ్యప్రదమన్నారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులు వేయాలని, భక్తులకు ఇబ్బంది లేకుండా దేవాదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేయాలని కోరారు. సమావేశంలో హిందూ ధర్మ రక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందివాడ వేణుగోపాల్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎ.శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో చైన్ స్నాచింగ్



సంఘటన స్థలంలో వివరాలు సేకరిస్తున్న సీఐ కృష్ణారావు

పార్వతీపురంటౌన్: పట్టణంలో చైన్‌స్నాచింగ్ కలకలం రేపింది. స్థానిక అజయ్‌నగర్ కాలనీకి చెందిన కృష్ణవేణి గురువారం వేకువజామున గుడికివెళ్లి తిరిగి వస్తుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలో ఉన్న రెండు తులాల చైన్‌ను తెంపుకుని పోయారు. ఈ మేరకు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ కృష్ణారావు తెలిపారు.

పలువురికి గాయాలు

● చెట్టును ఆటో ఢీకొనడంతో ప్రమాదం



కురుపాం సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

గుమ్మలక్ష్మీపురం: ప్రయాణికులతో వస్తున్న ఆటో చెట్టును ఢీ కొనడంతో పలువురు గాయాలపాలయ్యారు. గుమ్మలక్ష్మీపురం మండలం దేరువాడ గ్రామానికి చెందిన కొంతమంది దుడ్డుఖల్లు గ్రామంలో పొలం పనుల కోసం గురువారం ఆటోలో బయల్దేరి వస్తుండగా మార్గమధ్యంలోని కంబగూడ గ్రామ సమీపంలో ఆటో అదుపుతప్పి చెట్టును ఢీ కొంది.ఈ ప్రమాదంలో ఆటోలోని ప్రయాణికులకు గాయాలవ్వగా..సమీపంలోని దుడ్డుఖల్లు పీహెచ్‌సీకి తరలించారు. వారిలో స్వల్పగాయాలైన వారిని ప్రథమ చికిత్స అనంతరం డిశ్చార్జ్ చేశారు. మిగిలిన వారికి తీవ్రంగా గాయాలు కావడంతో కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి రిఫర్ చేయగా వైద్యసేవలు పొందుతున్నారు. ఈ సంఘటనపై ఎల్విన్‌పేట పోలీసులు దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

విజయనగరం ఫోర్ట్: హెచ్ఐవీ ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఆర్‌కేఎస్‌కే కౌన్సిలర్ అంబళ్ల కొండమ్మ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐలో గురువారం హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. హెచ్ఐవీ వచ్చిన తర్వాత బాధపడేకంటే రాకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. హెచ్ఐవీ ఏవిధంగా వ్యాప్తి చెందుతుంది, రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹210

శ్రమించారు.. సాధించారు



ఒకటే జననం..ఒకటే లక్ష్యం..కష్టాలొచ్చినా.. కన్నీరొలికినా అలుపు లేదు మనకు గెలుపు పొందేవరకు అని నిరూపించారు పలువురు యువత. తాము ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు సరదాలు..సంతోషాలు వదులుకున్నారు. నిరంతరం శ్రమించి..తాము చేరాలని భావించిన గమ్యానికి చేరుకున్నారు. ఏపీఎస్పీ బుధవారం విడుదల చేసిన పరీక్ష ఫలితాల్లో ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన పలువురు యువత ఎస్సై పోస్టులు సాధించి టార్గెట్ రీచ్ అయ్యారు. దీంతో వారి కుటుంబాలన్నీ ఆనంద సాగరంలో మునిగి పోయాయి.

● సాధించిన పలువురు యువత

బూరి రాజశేఖర్ (ఏపీఎస్‌పీ ఎస్సై)



తండ్రి: చంద్రినాయుడు
తల్లి:గౌరీశ్వరి
విద్యాభ్యాసం: 1 నుంచి 5 తరగతులు..ఎంపీయూపీ స్కూల్-విజయరాంపురం
6-10 తరగతులు-జెడ్పీ హైస్కూల్-నెమలాం, ఇంటర్మీడియట్-ప్రైవేట్ జూనియర్ కళాశాల(విజయనగరం)
బి.టెక్-ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాల(విశాఖ)

కొట్నాన రాము (ఏపీఎస్‌పీ ఎస్సై)



తండ్రి: వెంకటనాయుడు
తల్లి: కృష్ణవేణి
తమ్ముడు: అనిల్(ఇంటిలిజెన్స్ ఎస్సై)
విద్యాభ్యాసం:-
1-5తరగతులు-ఎంపీఈపీ స్కూల్, కొల్లివలస 6-9-జెడ్పీ హైస్కూల్-వంతరాం, 10వ తరగతి-సాగర్ హైస్కూల్-పణుకువలస, ఇంటర్మీడియట్, బి.టెక్ ప్రైవేట్ కళాశాలలు(బొబ్బిలి)

తమ్మిరెడ్డి ధనుంజయ ఏపీఎస్‌పీ ఎస్సై



తండ్రి: గోవిందరావు
తల్లి: కళావతి
విద్యాభ్యాసం: బి.టెక్

తెర్లాం: ఏపీఎస్పీ ఎస్సై పోస్టులకు తెర్లాం మండలానికి చెందిన ఇద్దరు రైతు బిడ్డలు ఎంపికయ్యారు. బుధవారం రాత్రి విడుదలైన ఎస్సై పోస్టుల ఫైనల్ ఫలితాల్లో ఎస్సైలుగా ఎంపికైన మండలంలోని విజయరాంపురం(బూరిపేట), కొల్లివలస గ్రామాలకు చెందిన బూరి రాజశేఖర్, కొట్నాన రాము వ్యవసాయ కుటుంబాలకు చెందిన వారు. వారిద్దరూ ఎస్సైలుగా ఎంపిక కావడంతో వారి కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. వారిద్దరినీ ఆయా గ్రామస్తులు అభినందించారు. అలాగే మండలంలోని ఉద్దవోలు గ్రామానికి చెందిన తమ్మిరెడ్డి ధనుంజయ ఏపీఎస్పీ ఎస్సైగా ఎంపికయ్యాడు.

మెరకముడిదాం మండలంలో ఇద్దరు ఎంపిక



తోకలనారాయణ రావు



పాలూరిసత్య నారాయణ

మెరకముడిదాం: రాష్ట్ర ప్రభుత్వం గురువారం వెలువరించిన ఎస్సై పోస్టుల రాతపరీక్ష ఫలితాల్లో మెరకముడిదాం మండలంలోని కొమ్మువానివలసకు చెందిన తోకలనారాయణరావు, యాడిక గ్రామానికి చెందిన పాలూరుసత్యనారాయణలు ఎంపికయ్యారు. వారిలో పాలూరుసత్యనారాయణ ఇప్పటికే ఎఆర్ కానిస్టేబుల్‌గా, సివిల్ కానిస్టేబుల్‌గా పనిచేశాడు. కొమ్మువాని వలస గ్రామానికి చెందిన తోకలనారాయణ నేరుగా ఎస్సై సెలక్షన్‌లో ఎంపికయ్యాడు. పాలూరు సత్యనారాయణ రైతు కుటుంబానికి చెందినవాడు కాగా, తోకలనారాయణది రైతుకూలీ కుటుంబం.

ఉద్యోగాలు చేస్తూనే ఎస్సైలుగా ఎంపిక



వెంపడాపు ఈశ్వరరావు



పిన్నింటి శివ

చీపురుపల్లిరూరల్(గరివిడి): రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు బుధవారం విడుదల చేసిన ఫలితాల్లో గరివిడి మండలంలోని ఏనుగువలస, వెదుళ్లవలస గ్రామాలకు చెందిన ఇద్దరు యువకులు ఉద్యోగాలు చేస్తూనే కొత్తగా ఎస్సై ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఏనుగువలస గ్రామానికి చెందిన వెంపడాపు ఈశ్వరరావు ఆర్థికంగా పేద కుటుంబానికి చెందినవాడు. కష్టపడి చదివి ఆరు నెలల క్రితం రైల్వేశాఖలో గూడ్స్ గార్డుగా ఉద్యోగం సాధించాడు. ఎస్సై కావాలనే లక్ష్యంతో ఉద్యోగం చేస్తూనే ప్రిపరేషన్ కొనసాగించి గుంటూరు సివిల్ ఎస్సైగా ఉద్యోగం సాధించాడు. వెదుళ్లవలస గ్రామానికి చెందిన పిన్నింటి శివ చీపురుపల్లిలో అగ్నిమాపక కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తూ ఏలూరు రేంజ్ సివిల్ ఎస్సై ఉద్యోగం సాధించాడు. శివ తల్లిదండ్రులు రోజువారీ కూలీలు.

తొలిప్రయత్నంలోనే...



తల్లిదండ్రులతో ఆనందం పంచుకుంటున్న అశ్విని

సంతకవిటి: మండలంలోని హొంజరాం గ్రామానికి చెందిన పేదింటి విద్యార్థిని తొలి ప్రయత్నంలోనే ఎస్సై పోస్టు సాధించింది. దీంతో ఆ ఇంట్లో ఆనందం అంబరాన్నంటింది. గ్రామానికి చెందిన దుప్పలపూడి అశ్విని 593వ ర్యాంకుతో సివిల్ విభాగంలో ఎస్సై పోస్టు సాధించింది. ఆమె తల్లిదండ్రులు జయలక్ష్మి, కృష్ణారావులు ఓ వైపు వ్యవసాయ కూలీ పనులతో పాటు స్వర్ణకార వృత్తిని చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉండగా, పెద్ద కుమార్తె అశ్విని ఎస్సై ఉద్యోగం సాధించింది. అశ్విని ఎస్సై పోస్టు కు ఎంపిక కావడంతో గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

విద్యాభ్యాసం

1 నుంచి 8వ తరగతి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల, తొమ్మిది, పదోతరగతులు రాజాంలోని భాష్యం స్కూల్, ఇంటర్‌మీడియట్ రాజాంలోని నారాయణ కాలేజీ, బీఎస్సీ కంప్యూటర్స్ డిగ్రీ శ్రీకాకుళంలోని ఆదిత్య కళాశాల.

ఎస్సై పోస్టుకు ఫైర్‌మన్ ఎంపిక



ములగడ హరీష్

విజయనగరం క్రైమ్: ఎస్సై ఉద్యోగాల రాత పరీక్షల ఫైనల్ ఫలితాల్లో గంట్యాడ మండలం కొటారుబిల్లి గ్రామానికి చెందిన ములగడ హరీష్ ఎంపికయ్యాడు. విజయనగరం ఫైర్ స్టేషన్‌లో 2020నుంచి కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఎస్సైగా ఎంపికైన హరీష్ సాధారణ రైతు కుటుంబానికి చెందిన వాడు.

తూడిలో టీచర్ కొడుకు



మనోజ్‌కు మిఠాయి తినిపిస్తున్న ప్రసాదరావు, సుశీలమ్మ

వీరఘట్టం: మండలంలోని తూడి గ్రామానికి చెందిన అన్ను మనోజ్‌కుమార్ 213 మార్కులు సాధించి సివిల్ విభాగంలో ఎస్సై పోస్టుకు ఎంపికయ్యాడు. ఆయన తండ్రి ప్రసాదరావు మండలంలోని రేగులపాడు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. తల్లి సుశీలమ్మ గృహిణి. తమ కుమారుడు ఎస్సైగా ఎంపికవడంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు సంబరాలు చేసుకుని వీధిలో మిఠాయిలు పంచారు.

సాఫ్ట్‌వేర్ టు ఎస్సై



తల్లితండ్రులతో సాయినాథ్

పాలకొండ రూరల్: పట్టణానికి చెందిన తుమ్మగుంట సాయినాథ్ ఎస్సై పోస్టు సాధించాడు. ఈ మేరకు గురువారం ఆయన తల్లితండ్రులు శంకరరావు, అనూష మాట్లాడుతూ బి.టెక్ పూర్తి చేసిన తమ కుమారుడు బెంగళూరులో ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడని, ఎటువంటి తర్ఫీదు లేకున్నా తొలి ప్రయత్నంలో ఎస్సైగా ఎంపికయ్యాడని తెలిపారు. ఈ సందర్భంగా సాయినాథ్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో సివిల్స్, ఉన్నత లక్ష్యం వైపు అడుగులు వేస్తానని తెలిపాడు.

రిజర్వ్ ఎస్సైగా మొయిద యువకుడి ఎంపిక



నెల్లిమర్ల రూరల్: ఎస్సై ఫలితాల్లో నెల్లిమర్ల మండలంలోని మొయిద నారాయణపట్నం గ్రామానికి చెందిన మీసాల అనిల్ ఆర్ఎస్సైగా ఎంపికయ్యారు. అనిల్ తల్లిదండ్రులు బంగారునాయుడు, సత్యవతి సాధారణ కూలీలు. పదో తరగతి వరకు మొయిద ఉన్నత పాఠశాల, ఇంటర్‌మీడియట్ గొట్లాం గాయత్రి కళాశాల, డిగ్రీ విజయనగరంలోని మహారాజా కళాశాలలో పూర్తి చేశాడు. సోదరుడు సురేష్ ఆర్మీలో పనిచేస్తూ అనిల్‌కు ఆర్థికంగా చేయూతనందించాడు. ఎస్సై ఉద్యోగానికి ఎంపికైన అనిల్‌కు ఎ మ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

జామిలో రైతుబిడ్డ



జామి: మండలంలోని వెన్నె పాడు గ్రామానికి చెందిన రైతు బిడ్డ రంది కోటరావు ఆర్ఎస్సైగా ఉద్యోగం సాధించాడు. కోటరావు 10వతరగతి వరకు ప్రభుత్వ పాఠశాల ల్లో విద్యాభ్యాసం సాగించాడు. కాకినాడలోని కైట్ కళాశాలలో బి.టెక్ చదివాడు, ఎస్సై కావాలన్న లక్ష్యంతో శ్రమించాడు. గతంలో రెండు సార్లు కానిస్టేబుల్‌గా సెలెక్ట్ అయినా వెళ్లలేదు. మామయ్య ఎర్నాయుడు, చెల్లి రమ్యల ప్రోత్సాహంతోనే ఎస్సై ఉద్యోగం సాధించానని కోటరావు తెలిపాడు.

ఎస్ఐగా ఎంపికైన కూలీ బిడ్డ



రామభద్రపురం: మండలంలోని ఆరికతోట గ్రామానికి చెందిన సురగాల సంధ్య సివిల్ ఎస్సైగా ఎంపికైంది. ఆమె తండ్రి సురగాల తంబు వ్యవసాయ కూలీ. తల్లి విమల గృహిణి.కుమార్తె సంధ్య విద్యాభ్యాసమంతా ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాల్లో సాగింది. గ్రామ సర్పంచ్ పెంకి పుష్పమ్మ, ఎంపీటీసీ పెంకి అరుణ, గ్రామ పెద్ద పెంకి సుధాకర్ ఎస్సై పోస్టు సాధించిన సంధ్యను అభినందించారు.

సత్తా చాటిన సంధ్య

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన పారిపిరెడ్డి సంధ్య సివిల్ ఎస్సైగా ఎంపికైంది. పారిపిరెడ్డి వెంకటరావు, అప్పలనరసమ్మలకు ఇద్దరు పిల్లలు. కొడుకు ఎర్నాయుడు, కుమార్తె సంధ్యలు ఇద్దరూ ఇప్పుడు ఎస్సైలు కావడంతో ఆ కుటుంబం ఆనందానికి అవధులు లేవు. కుమారుడు ఎర్నాయుడు 2020లో తెలంగాణలో ఏఆర్ సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా కొలువు సాధించాడు. ఎస్.కోటలో ఇంటర్మీడియట్, విశాఖలో డిగ్రీ పూర్తి చేసిన సంధ్య తన అన్న ఎర్నాయుడు ఇచ్చిన స్ఫూర్తి, ధైర్యం, సూచనలు, భర్త వెంకట్ సహకారంతో కాకినాడలో ఏడాది పాటు శిక్షణ తీసుకుని ఎస్సై పరీక్ష రాసి సత్తా చాటి జోన్-2లో సివిల్ ఎస్సైగా కొలువు సాధించింది.



అన్న ఎర్నాయుడుతో సంధ్య

ముగిసిన హ్యాక్‌థాన్ గ్రాండ్ ఫినాలే



విజేతలతో నిర్వాహకులు

రాజాం సిటీ: స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్ వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జీఎంఆర్ ఐటీ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు ఇ.శంకరరావు పిలుపునిచ్చారు. స్థానిక జీఎంఆర్ ఐటీలో రెండు రోజులపాటు సాగిన హ్యాక్‌థాన్-2023 సాఫ్ట్‌వేర్ ఎడిషన్ గ్రాండ్ ఫినాలే బుధవారం రాత్రి 11.30 గంటల వరకు సాగింది. ఈ పోటీలో 11 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు 26 బృందాలుగా పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఏఐసీటీఈ కేటాయించిన ముఖ్యమైన సమస్యలపై విద్యార్థులు చేసిన కృషిని అభినందించారు.

విజేతలు వీరే..

భారతదేశంలో ప్రాథమిక రంగం వ్యవసాయాన్ని మెరుగుపర్చడం, మన వ్యవసాయ ఉత్పత్తులను నిర్వహించడం అనే అంశంపై మహారాష్ట్ర నాందేడ్‌లోని గురుగోవింద్ సింగ్ ఐటీ విద్యార్థులు విజేతగా నిలిచారు. వారసత్వం-సంస్కృతి అనే అంశంపై పంజాబ్‌కు చెందిన థాపర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థులు బహుమతి గెలుపొందారు. ఫిట్‌నెస్ అండ్ క్రీడలు అంశంపై తమిళనాడుకు చెందిన సవిత స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ విద్యార్థులు, మహారాష్ట్రకు చెందిన సరస్వతి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ విద్యార్థులు సంయుక్త విజేతలుగా నిలిచారు. బొమ్మలు, ఆటలు అనే అంశంపై కర్నాటకకు చెందిన జీఎంఐటీ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. విజేతలకు నగదు బహుమతితోపాటు షీల్డ్‌లను నిర్వాహకులు అందజేశారు. విజేతలను ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ గిరీష్, ప్రిన్సిపాల్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్‌లు అభినందించారు.

శతశాతం ఉత్తీర్ణతకు అవగాహన సదస్సులు



విద్యార్థుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ బోని రామానందం

● 14సోషల్ వెల్ఫేర్ వసతి గృహాల్లో ప్రత్యేక క్యాంపులు
● సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామానందం

గజపతినగరం: విజయనగరం సాంఘిక సంక్షేమ శాఖ రూరల్ పాఠశాలల పరిధిలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులందరికీ ప్రత్యేక ప్రేరణ, అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తున్నామని, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ బోని రామానందం తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన గజపతినగరం ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 14 సోషల్ వెల్ఫేర్ (ప్రీమెట్రిక్) వసతి గృహాలు ఉన్నాయని అందులో 156 మంది 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఉన్నారని వారికోసం విడతల వారీగా ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి శతశాతం ఉత్తీర్ణతకు కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో మొదటి క్యాంపు గజపతినగరంలో ఏర్పాటు చేశామన్నారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన కార్పొరేట్ స్థాయి విద్యాబోధన అందేలా చూస్తూ వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిని ఎ గ్రేడ్ స్థాయికి తీసుకువచ్చి శతశాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా కృషి చేస్తామని రామానందం చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ వీఎల్ఎం స్వరూప కుమారి, గజపతినగరం, బొండపల్లి, లోగీశ, గర్భాం, రామతీర్థం, గంట్యాడ వసతిగృహాల సంక్షేమ అధికారులు ఎం.గౌరి, కె.గౌరీలక్ష్మి, ఎస్.అప్పలనాయుడు, ఎస్.వెంకటరావు, జి.సింహాచలం, జి.సన్యాశిరావులతో పాటు గజపతినగరం సాంఘిక సంక్షేమ కళాశాల బాలికలు, బాలుర వసతి గృహ సంక్షేమ అధికారులు పి. మీనాక్షి, ఎస్.రామకృష్ణ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

భోగాపురం: మండలంలోని రాజాపులోవ గ్రామంలో ఒక ఇంట్లో జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడిన కిలారి అప్పయ్యమ్మ(75) విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఏఎస్సై రాజు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఈనెల 15వ తేదీన ఇంట్లో మంట వేసుకుని చాలి కాగుతుండగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పు అంటుకుని అప్పయ్యమ్మ తీవ్ర గాయాలపాలైంది. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను విశాపట్నం కేజీహెచ్‌కు తరలించారు. మృతురాలి కుమారుడు రాములప్పుడు ఫిర్యాదు మేరకు కేసు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

హెచ్‌సీపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

భోగాపురం: మండలంలోని పోలిపల్లి గ్రామ సమీపంలో టీడీపీ నాయకులు నిర్వహించిన యువగళం ముగింపు సభ సందర్భంగా విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ కేఎస్ మూర్తిపై నలుగురు దుండగులు దాడి చేశారు. ఈ సందర్భంగా మూర్తి మెడలోని బంగారు గొలుసుకు ఉన్న లాకెట్ పోయింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సూర్యకుమారి తెలిపారు.

కెరీర్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోండి

విజయనగరం క్రైమ్: విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రుల కలలన సాకారం చేయాలని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు సూచించారు. అయ్యన్నపేటలోని ఎస్.కె.డిగ్రీ కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాలు, డ్రగ్స్ వద్ద కలిగే అనర్థాలు, కెరీర్ గైడెన్స్ పట్ల గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుని కెరీర్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, నియంత్రణకు సహకరించాలని, ఎక్కడైనా మత్తుపదార్థాలు గుర్తిస్తే 14500కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

కరోనా పట్ల అప్రమత్తం

● ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



ఆధునిక వైద్యపరికరాలను ప్రారంభిస్తున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: దేశంలో మళ్లీ కరోనా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో వైద్యారోగ్యశాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన సాలూరు పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన ఆధునిక ఈసీజీ, ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్, తదితర మిషన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మారుమూల గిరిజన ప్రాంతాలకు అత్యాధునిక వైద్యపరికరాలు ఏర్పాటుచేస్తూ వైద్యానికి ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారన్నారు.

జాతీయ ఖోఖో పోటీలకు దిలీప్ ఎంపిక



జాతీయ ఖోఖో పోటీలకు ఎంపికైన దిలీప్

విజయనగరం: జాతీయస్థాయిలో జరగనున్న ఖోఖో పోటీలకు నగరానికి చెందిన బార దిలీప్ ఎంపికయ్యాడు. గత నెలలో చిత్తూరు జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాలుర ఖోఖో పోటీల్లో విజయనగరం జట్టు తరపున ప్రాతినిధ్యం వహించి ఉత్తమ క్రీడా ప్రదర్శనతో రాష్ట్ర జట్టులోకి అర్హత సాధించాడు. ప్రస్తుతం విజయనగరంలో ఇంటర్‌మీడియట్ అభ్యసిస్తున్న దిలీప్ ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు రాయపూర్‌లో జరగనున్న జాతీయ పోటీల్లో ఆడనున్నాడు. ఈ సందర్భంగా దిలీప్‌ను జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.గోపాల్, కళాశాల ప్రిన్సిపాల్ అభినందించారు.